మెజార్టీలో రికార్డు సృష్టించాలి

- జగన్ నేతృత్వంలో గ్లోబల్ హబ్‌గా విశాఖ
- దక్షిణ నేతల సమన్వయ కమిటీ సమావేశంలో వాసుపల్లి గణేష్‌కుమార్



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



వాసుపల్లిని అభినందిస్తున్న బీచ్ చిల్లర వర్తకులు

డాబాగార్డెన్స్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం మెజారిటీలో రికార్డు సృష్టించనుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధి 37, 38, 39, 41, 42 వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, బూత్ ప్రెసిడెంట్లతో ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఖాయమని, 60 నుంచి 70 శాతం మెజార్టీ వచ్చేలా పని చేస్తామని ధీమా వెల్లడించారు. వార్డులో ప్రతి గడప, కుల సంఘాల నేతలు, ముఖ్యంగా యువతను కలిసి జగనన్న చేసిన అభివృద్ధిని, భవిష్యత్ కార్యాచరణను తెలియజేయాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో ఇప్పటికే సగం మందికి పైగా పేదలకు ఇళ్లు మంజూరు చేశామని, నూతన పింఛన్లు అందించామన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ఎక్కడా జరగని విధంగా ప్రజాదర్బార్ వంటి కార్యక్రమం నిర్వహించామన్నారు. వారంలో 30 నుంచి 40 మంది పేషెంట్లను కలిసి ఆర్థిక సాయం చేసిన విషయాలు ప్రతి గడపకు తెలియజేయాలన్నారు.

గ్లోబల్ హబ్‌గా విశాఖ..

విశాఖపట్నం గ్లోబల్ హబ్‌గా మారబోతుందని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవల్సిన అవసరం ఉందని వాసుపల్లి పిలుపునిచ్చారు. నియోజకవర్గ గెలుపుతో పాటు విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీకి భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు. ఎవరి ప్రలోభాలకు గురి కాకుండా నిజాన్ని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వాసుపల్లిని సత్కరిస్తున్న పూర్ణామార్కెట్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు

వాసుపల్లికి పూర్ణామార్కెట్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అభినందన..

మంచి నాయకత్వమే కాదు.. సేవలో కూడా రారాజుగా వెలుగుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్ విజయం తథ్యమని పూర్ణామార్కెట్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. బుధవారం వారు వాసుపల్లిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసి వాసుపల్లి గణేష్‌కుమార్‌ని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించుకునే బాధ్యత తమదేనన్నారు. ఇటువంటి గొప్ప సేవ చేసే నాయకుడికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగానే కాదు మంత్రిగా రావాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి. సత్యనారాయణ, జె. ఈశ్వరరావు, బి. అప్పారావు, పి. వెంకట్, వానపల్లి స్వామి, కాకి శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉన్న వాసుపల్లిని మళ్లీ గెలిపించుకుంటాం..

నిత్యం అండగా ఉంటూ తమకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే గణేష్‌కుమార్‌ని మూడవసారి గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇస్తామని బీచ్ చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. 29వ వార్డు నాయకుడు పీతల వాసు నేతృత్వంలో వాసుపల్లిని వారంతా కలిశారు. ఈ సందర్భంగా వాసుపల్లిని సత్కరించారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం వాసుపల్లిని గుర్తించి టికెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యేని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని సంఘం ప్రతినిధులు దుండి తిరుమలరావు, రమణ తెలిపారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా దక్షిణలో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండా మాత్రమేనని, తమకి అండగా ఉన్న వాసుపల్లిని మళ్లీ గెలిపించుకోవడం తమ బాధ్యతగా చెప్పారు. కార్యక్రమంలో టి. రాజు, ఆర్సర్ట్, ముగడ రాము, గువ్వల శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు శోభన్‌బాబు



శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్, శోభన్‌బాబు అభిమానులు

డాబాగార్డెన్స్ : సినీ హీరో శోభన్‌బాబు క్రమశిక్షణకు మారుపేరు అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శోభన్‌బాబు 16వ వర్ధంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్ ఎదురుగా గల ప్రాంగణంలో శోభన్‌బాబు విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ పాల్గొని ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శోభన్‌బాబు కుటుంబ చిత్రాల నటుడని, అన్ని రకాల పాత్రలు పోషించారని గుర్తు చేశారు. సినిమాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టాలన్న శోభన్‌బాబు సూచనతో నటులు చంద్రమోహన్, మురళీమోహన్, జయసుధ వంటి వారు ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షుడు ముప్పల పోలారావు, కోడూరి కనకరాజు, నాగరాజు, కె. శోభన్ బాబు, దసపల్లా ప్రసాద్, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం : జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానంలో బుధవారం భక్తులకు దాహార్తి తీర్చేందుకు స్వాతి అడ్వాన్స్‌డ్ డెంటల్ మెడికల్ కేర్ అధినేత డాక్టర్ ఎస్. భరత్, డాక్టర్ స్వాతికుమారి ఆర్థిక సహాయంతో ప్యూర్ ఫైన్ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో డీఏస్ సురేష్‌బాబాకు దాతల కుటుంబ సభ్యులు పి.ధర్మారావు, ఎస్.బాలకృష్ణ సుమారు రూ. 2 లక్షల విలువ గల వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. దీనిని ప్రారంభించి భక్తులకు తాగునీరు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, ఆలయ చైర్మన్ లండా రమణ, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

23న సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ఈ నెల 23 ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వైభవంగా లక్ష తులసి పూజ



ఆలయ మండపంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామికి తులసీదళార్చన చేస్తున్న అర్చకులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏకాదశి, బుధవారం సందర్భంగా లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య తులసి పత్రితో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి సేవలో తరించారు. బల్లిగిరి గోవింద నామస్మరణతో మార్మోగింది. మూలవిరాట్టుతో పాటు ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి తులసి దళాలతో అర్చించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం, పూజలు చేశారు. పసుపు, కుంకుమలతో అమ్మవారిని అభిషేకించారు. పలు రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించా రు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ యాక్ట్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స తదితరులు

డాబాగార్డెన్స్ : యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దుడ్డి ఇందు రూపొందించిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ యాక్ట్ పుస్తకాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. 2024 ఎన్నికల సందర్భంగా డెవలప్‌మెంట్ ఆఫ్ పీపుల్ అజెండా ఇన్ ఏపీ అండ్ తెలంగాణ డ్రాఫ్ట్‌ను రూపొందించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి, కేవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోన శంకర్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి చక్కటి స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ శ్రావణి

సీతమ్మధార : ఆరోగ్య సురక్ష ప్రజలకు వరమని, ప్రజలందరకీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని వైద్యాధికారి శ్రావణి అన్నారు. దొండపర్తిలోని ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో పలువురు రోగులకు ఆమె సేవలందించారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ప్రతి ఒక్కరికి మందులు పంపిణీ చేశారు. ఉచితంగా ఏడు రకాల టెస్టులు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. శిబిరం సందర్భంగా రోగుల కోసం 172 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధిపై కమిటీ సమావేశం



విశాఖ వాణి మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులతో గత త్రైమాసిక ఫలితాలు, 2024–25 సంవత్సర ప్రణాళికలు, రాబోయే రోజుల్లో హిందీ భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, శిక్షణ కోసం నమోదు వంటి విషయాల గురించి చర్చించారు. వాల్తేర్ డివిజన్ ప్రచురించిన విశాఖ వాణి మ్యాగజైన్‌ను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఆవిష్కరించారు. హిందీ భాష ప్రాముఖ్యాన్ని అన్ని విభాగాల్లో తెలియజేసి, మరింత ఎక్కువ మంది వినియోగించేలా చేయాలని ఆయన సూచించారు. విశాఖ వాణి మ్యాగజైన్‌లో పలు శీర్షికలు రాసిన అధికారులను డీఆర్ఎం అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వాల్తేర్ డివిజన్ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారం ఆరోగ్యకరం



పోషణ వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ డాక్టర్ జయదేవి

సీతంపేట: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ డాక్టర్ జయదేవి అన్నారు. జీవీఎంసీ 44వ వార్డు ఎంటీసీ పాలెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా బుధవారం పోషణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాలను అరికట్టడానికి ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా వెయ్యి రోజుల పోషణ గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. శిశువులకు ఏడు నెలల వయసు వచ్చే సరికి అన్నప్రాసన చేసి ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శారదాదేవి, ఏసీడీపీవో శ్రీలత, ఫుడ్ సేఫ్టీ సెక్యూరిటీ ఆఫీసర్ మాడిశెట్టి దుర్గాదేవి, సూపర్‌వైజర్లు జ్యోతి, కుమారి, అంగన్‌వాడీ టీచర్లు నబీనా హీరా, లక్ష్మి, లక్ష్మణకుమారి పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఏఐ సాంకేతికతపై అవగాహన



అభిరామ్ సరస్వతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: వ్యవసాయ రంగంలో ఆర్టిఫీషియల్ సాంకేతికత (ఏఐ) ఉపయోగాలపై అమెరికాలో స్థిరపడిన డాక్టర్ అభిరామ్ సరస్వతి అవగాహన కల్పించారు. బుధవారం ఏయూ జువాలజీ విభాగంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. డేటా సైన్స్ రంగంలో అవకాశాలను వివరించారు. టీకాబ్స్–ఈ నిర్వాహకులు డాక్టర్ వై.రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా అభిరామ్ సరస్వతిని వర్సిటీ తరపున సత్కరించారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ–చెన్నై ఆధ్వర్యంలో గత నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో 36 మందికి గానూ 25 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ త్రివేణి

మహారాణిపేట : ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బుధవారం నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు నెల రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీస్కూళ్లు, పాఠశాలల్లో స్క్రీనింగ్, ట్రీట్‌మెంటు క్యాంపులు, టూత్ బ్రషింగ్, సామూహిక బ్రషింగ్, నోటి పరిశుభ్రత పద్ధతుల ప్రదర్శన, నోటి వ్యాధుల పరీక్ష, చికిత్సకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. నోరు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారు. నోటి ఆరోగ్యానికి అంతటి ప్రాముఖ్యత ఉంది. అందుకే ప్రతి ఏడాది మార్చి 20వ తేదీన ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. బుధవారం నాటి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి విప్రో జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమత, ప్రొగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ దంత వైద్య విభాగంలో..

ప్రపంచ నోటి ఆరోగ్య సంరక్షణ దినోత్సవం కేజీహెచ్‌లో ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో దంత వైద్య విభాగంలో బుధవారం చిన్న పిల్లలకు దంత పరీక్షలు నిర్వహించారు. దంత వైద్య విభాగాధిపతి డాక్టర్ త్రివేణి చిన్న పిల్లలకు దంత పరీక్షలు చేసి, దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఫ్లోరైడ్ అప్లికేషన్, బ్రష్ చేసే విధానం గురించి విశదీకరించారు. నోటి క్యాన్సర్ రాకుండే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. బుధవారం నుంచి నెల రోజుల పాటు నోటి కాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వినోద్‌కుమార్, లావణ్య, సంధ్యారాణి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్ : ఆలిండియా ఆహ్వాన వాలీబాల్ చాంపియన్‌షిప్ డీఆర్ఎం కప్ ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభం కానుంది. మెన్స్‌లో ఎనిమిది జట్లు.. వుమెన్స్‌లో నాలుగు జట్లు పోటీపడనున్నాయి. నాలుగు రోజుల పాటు రైల్వే స్టేడియం వాలీబాల్ కోర్టులో జరిగే ఈ పోటీల్లో కిట్ యూనివర్సిటీ, డిబి క్లబ్, ఈకోరైల్వే, సాయ్, సెయింట్ జాన్స్ కాలేజ్, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లా జట్లు మెన్స్‌లో తలపడనుండగా.. వుమెన్స్‌లో కిట్ వర్సిటీ, జేపీయర్ యూనివర్సిటీ, చెన్నై కాలేజ్, ఎస్‌బీపీ ట్రస్ట్ జట్లు పోటీపడనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు టోర్నీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈకోర్స్ వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌భాటి, జాయింట్ క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు

10 ప్రాంతాల్లో 2,899 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం తోటవీధి (భీమిలి), పెందుర్తి, శ్రామికనగర్, నక్కవానిపాలెం, లంకెలపాలెం, రైల్వే న్యూకాలనీ, శివనగర్, దొండపర్తి, పాత రేసవానిపాలెం (స్వర్ణభారతి), తోటగరువు, బక్కన్నపాలెంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 2,899 మందికి వైద్య సేవలందించారు. 30 మందిని ఉన్నత వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు, 12 మందిని కంటి చికిత్స కోసం ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం నగర పరిధిలోని బాలాజీనగర్, ఎంఎస్ఆర్ నగర్, లాసన్స్‌బే కాలనీ, ఇసుకతోట, రైల్వే న్యూకాలనీ, జబ్బరితోట, కంచరపాలెం, సిద్దేశ్వరం, న్యూగాజువాక, నరసింహనగర్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

సంస్కృతి రక్షణలో సాహిత్యం కీలకం

సీతంపేట: ఒక దేశం, జాతి, సమాజం బతకాలంటే ఆ దేశపు సంస్కృతి బతికుండాలని సాహితీవేత్త డాక్టర్ విజయ్‌గోపాల్ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'సంస్కృతి రక్షణలో సాహిత్యం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు సమాజపు సంస్కృతిని బతికించే ప్రయత్నాలు చేయాలన్నారు. వసుధైక కుటుంబం అనే విశాలమైన దృక్పథం కలిగిన భారతీయ సంస్కృతి ప్రపంచానికే దారి చూపగలదన్నారు. మన మహాకావ్యాలు, పురాణాలు, ఉపనిషత్తులన్నీ మనిషి ఎలా జీవించాలి, ఎలా ప్రపంచాన్ని పరిరక్షించాలి అనే విలువలతో కూడి ఉన్నాయని తెలిపారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణలో సాహిత్యం కీలక పాత్ర పోషించిందన్నారు. డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, రచయితలు చిన సూర్యనారాయణ, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌తో జీవన ప్రమాణం తగ్గుముఖం

నేడు వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే

మహారాణిపేట : ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఒకరికి డౌన్ సిండ్రోమ్ సోకుతోందని, దీని వల్ల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుందని సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ కె.వి.శ్రీదేవి తెలిపారు. గర్భంలో శిశువు ఉండగానే వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా శిశువు ఆరోగ్య స్థితి తెలుసుకోవచ్చన్నారు. దీనికి అనేక కొత్త విధానాలు, అధునాతన ప్రక్రియలు వచ్చాయని బుధవారం మీడియాకు వివరించారు. ప్రతి ఏడాది మార్చి 21వ తేదీన వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం నిర్వహిస్తామని, దీని ద్వారా వచ్చే వ్యాధులు, ఇబ్బందులు, తీసుకోనవలసిన జాగ్రత్తలపై తమ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. డౌన్ సిండ్రోమ్ అనేది జన్యుపరమైన అంశమన్నారు. ఈ కారణంగా గుండె సంబంధిత వ్యాధులు, దృష్టి, వినికిడి, థైరాయిడ్ సమస్యలు, బుద్ధిమాంద్యం వంటి సమస్యలతో పిల్లలు జన్మిస్తారని వివరించారు. ఫలితంగా పిల్లల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుందన్నారు. వయసు మీరిన తర్వాత పిల్లల్ని కనడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయన్నారు. గర్భం దాల్చిన 11 వారాల నుంచి పరీక్షలు చేసి డౌన్ సిండ్రోమ్‌ను గుర్తించవచని డాక్టర్ శ్రీదేవి తెలిపారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉపాధి, శిక్షణపై ఎంఓయూ

అగనంపూడి: ఉపాధి, నైపుణ్య శిక్షణ, అవగాహన కార్యక్రమాలపై పరస్పర సహకారం అందించే లక్ష్యంతో దువ్వాడలోని ఫార్మాస్యూటికల్ కళాశాల, సీఎస్‌సీ అకాడమీ ఒప్పందం చేసుకున్నాయి. ఈ మేరకు దువ్వాడలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, సీఎస్‌సీ అకాడమీ సలహాదారు రామ్మోహనరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.